ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
జనగామ
ఆదివారం 2 ఫిబ్రవరి 2025



కొంత ఎక్కువ.. ఎంతో తక్కువ..



- మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్
- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- విమానాశ్రయం, లెదర్ పార్కు ఏర్పాటు దిశగా అడుగులు
- జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ప్రకటనతో ప్రయోజనం
- చిన్నపరిశ్రమలు, స్టార్టప్‌లకు చేయూత
- ఆదాయం పన్ను పరిమితి పెంపుతో హర్షం
- కిసాన్ కార్డు రుణ పరిమితి పెంపుతో ఆనందం
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

మోదం

- మామునూరు విమానాశ్రయం
- లెదర్ పార్కు
- చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు
- రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపు
- కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితి పెంపు
- ఆరు జిల్లాల్లో కేన్సర్ ఆస్పత్రుల ఏర్పాటు
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా

ఖేదం..

- కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన కరువు
- కొత్త రైల్వే మార్గాల ఊసే లేదు..
- సైనిక్ స్కూల్ మాటే లేదు..
- కానరాని గిరిజన విశ్వవిద్యాలయం
- మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు లేవు
- మేడారం జాతరకు జాతీయ హోదా లేదు
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ముచ్చటే లేదు





కేంద్ర బడ్జెట్ - 2025 ఉమ్మడి వరంగల్ జిల్లాకు కొంత మోదం.. కొంత ఖేదం కలిగించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓరుగల్లు ప్రజలకు పెద్దగా వరాలను ఏమీ కురిపించలేదు. కొన్ని ప్రతిపాదిత పథకాలకు నిధులను కేటాయించి సంతోషపెట్టారు. అయితే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రస్తావించలేదు. నిధులూ కేటాయించలేదు. రైల్వే పరంగా కొత్త లైన్లు, ప్రాజెక్టులు ప్రకటించలేదు. ఏళ్ల కల అయిన కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన లేదు. కోచ్ ఫ్యాక్టరీకి మాత్రం నిధులు ఇచ్చారు. ఇక మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధుల ఊసేలేదు. అలాగే మేడారం జాతరకు జాతీయ హోదా దక్కలేదు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ముచ్చటే లేదు. అయితే పేద, మధ్య తరగతి వర్గాలకు మాత్రం కేంద్రం వరాలను కురిపించింది. రైతులకు పెద్ద పీట వేసింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి చేయూతనిచ్చింది. ప్రధానంగా ఆదాయం పన్ను విషయంలో భారీ ఊరటను కల్పించింది. రూ.12లక్షల మేర ఆదాయం వరకు పన్నును మినహాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 లక్షల మంది మధ్యతరగతి వారికి లబ్ధి కలుగనున్నది. విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తామనే ప్రకటతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అడుగులు పడనున్నాయి. చిన్న పరిశ్రమలకు రాయితీ ప్రకటనతో పరిశ్రమల ఏర్పాటుకు పూల బాట పడనుంది. అలాగే జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో ఆరు ఆస్పత్రులు నిర్మించనున్నారు. అసంఘటిత కార్మికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. హెల్త్ కార్డులు అందించి యేటా రూ.5లక్షల వరకు ఆరోగ్య సదుపాయం కల్పించింది. మొత్తంగా కేంద్ర బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలకు కొంత ఆశాజనకంగా ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు : 8 లో..



వేదిక పైన హైకోర్టు జడ్జి నంద, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అధికారులు

గ్రామీణులకు కోర్టు సేవలు

- అదే హైకోర్టు ధ్యేయం..
- కేసుల వాయిదా పౌరుల హక్కుకు భంగం కలిగించడమే..
- కృత్రిమ మేధను న్యాయవాదులు వినియోగించుకోవాలి
- హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద
- స్టేషన్ ఘన్‌పూర్‌లో కోర్టు సేవలు ప్రారంభించిన నంద



కోర్టుహాల్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి నంద

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు కోర్టు సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయమని హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద తెలిపారు. ఘన్‌పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కం జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టు ఏర్పాటుతో సమీప గ్రామాల ప్రజలకు న్యాయసేవలు త్వరితగతిన అందుతాయని తెలిపారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ ప్రాంత ప్రజల, న్యాయవాదుల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. కోర్టు పరిధిలో మూడు వేల పెండింగ్ కేసులు ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కేసుల పరిష్కారం విషయంలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. బెయిల్ అనేది కేసుల విషయంలో తప్పనిసరి అంశమన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల సమన్వయంతో త్వరగా కేసులు పరిష్కరించే విధంగా చూస్తున్నామని తెలిపారు. కేసుల పరిష్కారంలో ఏఐ (కృత్రిమ మేధ)ని వినియోగించుకోవాలని న్యాయవాదులకు సూచించారు. కేసుల పరిష్కారం విషయంలో ఎక్కువ సమయం తీసుకోవద్దన్నారు. కేసులను పదే పదే వాయిదాలు వేసి ప్రజల ప్రాథమిక హక్కులకు ఇబ్బంది కలిగించొద్దని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఘన్‌పూర్ కోర్టు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కోర్టు ఏర్పాటు చరిత్రాత్మకం: కలెక్టర్

ఘన్‌పూర్‌లో కోర్టు ఏర్పాటు అనేది చరిత్రాత్మకమైనదని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా అన్నారు. ఘన్‌పూర్ మునిసిపాలిటీగా మారడం, ప్రస్తుతం కోర్టు ప్రారంభం కావడం అభివృద్ధికి సంకేతమన్నారు. కోర్టు పరిధిలో సివిల్ కేసులు ఎక్కువగా ఉన్నందున కోర్టు ఏర్పాటుతో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి రవీంద్రశర్మ, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్, సీనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, సందీప, ఫణీంద్ర భార్గవ, చంద్ర రుషి, బార్ అసోసియేషన్ ఘన్‌పూర్ అధ్యక్షుడు కనకం రమేష్, గట్టు మనోహర్, గద్దె అనిల్ కుమార్, అయిలయ్య, గుర్రం బాబు, గట్టు రవిగౌడ్ పాల్గొన్నారు.



మెటీరియల్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

విద్యార్థులు మంచి శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 01(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాయంలో శనివారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పదవ తరగతి విజయోస్తూ స్మార్ట్ లెర్నింగ్ మెటీరియల్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలో విద్యార్థులందరూ ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఆ ఆశయంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విజయోస్తు స్మార్ట్ లెర్నింగ్ మెటీరియల్ ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జనగామ జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడులు



తనిఖీలు చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

జనగామ రూరల్, ఫిబ్రవరి 01(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు జరిమానా విధించడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని చేసే రంగులతో కూడిన నిషేధిత పదార్థాలతో బిర్యానీలు, ఇతర తినుబండారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో అధికారులు రోహిత్‌రెడ్డి, స్వాతి, శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్, వినీల్ పాల్గొన్నారు.

కోటా కోసం కొట్లాట!



ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరగనున్న బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం

నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్

- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- పార్టీలకు అతీతంగా ఏకమవుతున్న ప్రజాప్రతినిధులు
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్ కోసం డిమాండ్
- ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల రద్దు, మహిళ రిజర్వేషన్లలో బీసీల వాటా
- బీసీ కోటా తేలాకే స్థానిక ఎన్నికలు పెట్టాలని డిమాండ్
- బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించిన నిర్వాహకులు

8

ఎస్సీ వర్గీకరణకు ధర్మపోరాటం

- కాంగ్రెస్‌లో మాలల పెత్తనం..
- నాకు ఏ పార్టీతో సంబంధం లేదు..
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- జనగామలో భారీ ర్యాలీ.. సభ





సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, ర్యాలీలో డప్పుకొడుతున్న మందకృష్ణ

జనగామ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు మాదిగలు ధర్మపోరాటం చేస్తుంటే, మాలలు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, కాంగ్రెస్‌లో మాలలదే పెత్తనమనిఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు... లక్ష డప్పుల దండోరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం జనగామలోని నెహ్రూ పార్కు నుంచి ఎస్ఎంఆర్ గార్డెన్ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మందకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు 31 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నట్టు పేర్కొన్నారు. తనకు ఏ పార్టీతో సంబంధం లేదని, ఎస్సీ వర్గీకరణ కోసం ప్రతీ ఒక్క పార్టీకి మద్దతు తెలపడం జరిగిందన్నారు.

పదవుల ఆశ చూపినా ఒప్పుకోలే..

బీసీ జాతీయ నాయకుడు ఆర్.కృష్ణయ్య బీసీల కోసం 30 ఏళ్ల ఉద్యమం చేసి పదవుల కోసం 4 పార్టీలు మారి పదవులను అనుభవించాడన్నారు. తనకు పదవులు ఇస్తామని ఆశపెట్టినా, వర్గీకరణే ముఖ్యమని ఏ పార్టీలో చేరలేదన్నారు. మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మద్దతు తెలిపిన పార్టీపై కూడా పోరాటం చేస్తామన్నారు.

వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలు..

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మొదటగా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఎస్సీ వర్గీకరణ అమలులో చేస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా అమలు చేయడంలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే వివేక్, వెంకటస్వామి, మల్లు భట్టివిక్రమార్క, ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ పార్టీలోని మాలల నాయకులు తమకున్న పలుకుబడితో వర్గీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వర్గీకరణపై సీఎం వైఖరి మారుతుందని ధ్వజమెత్తారు. అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధిస్తే రాబోయే తరాలకు భవిష్యతు ఉంటుందన్నారు. మహబూబ్ నగర్‌లో మాదిగలు ఎక్కువ ఉన్నారు కాబట్టే రేవంత్‌రెడ్డికి సీఎం పదవి వరించిందని, హామీలు మాదిగలకు ఇచ్చి మాలలకు ఉద్యోగాలు ఇస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 100కు 70 మంది మాదిగలు ఉన్నా, కాంగ్రెస్ మాదిగలకు రెండు ఎంపీ టికెట్లను ఇవ్వలేదని, మాలలను కాంగ్రెస్ పెంచి పోషిస్తోందని ఆరోపించారు. మాదిగలు చెప్పులు కుట్టే కుల వృత్తి అని సిగ్గు, భయం లేకుండా చెప్పుకోవాలన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమానికి మాదిగలు, ఉపకులాలు ప్రతీఒక్కరు డప్పుతో వచ్చి మాదిగల గుండె చప్పుళ్లను ప్రభుత్వానికి వినిపిస్తామన్నారు. ఫిబ్రవరి 7 ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తుందన్నారు.

మాదిగ జాతికి సూర్యుడు మందకృష్ణ: పల్లా

మాదిగ జాతికి సూర్యుడు మందకిష్ణ మాదిగ అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఏమతం, కులంలో పెట్టిన ప్రతి ఒక్కరు ప్రజల కోసం పని చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన పోరాటమని, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో శ్రమించిన మందకృష్ణకు పద్మశ్రీ చాలా చిన్నదని, ఎస్సీ వర్గీకరణలో పద్మవిభూషణ్ రావాలన్నారు.

లింగాలఘణపురంలోని వీరభద్రస్వామి గుట్ట



మంచు కురిసే వేళలో..!

మంచు కురిసే వేళలో పల్లెసీమలు కనువిందు చేస్తున్నాయి. హిమపాతంతో గుట్టలు, పంటపొలాలు రమణీయంగా దర్శనమిస్తున్నాయి. ప్రకృతి అందాలకు పల్లె వాసులు మైమరిచిపోతున్నారు. ఉదయం 7 నుంచి 9గంటల దాకా పల్లె కనాచిపై భారీగా మంచు దుప్పటి కప్పేస్తుండడంతో ప్రకృతి ప్రేమికులను ఫిదా అవుతున్నారు.

- లింగాలఘణపురం(ఆంధ్రజ్యోతి)

కొత్తపల్లి-లింగాలఘణపురం దారిలో..





సోనియా గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సోనియా గాంధీ దిష్టిబొమ్మ దహనం

పాలకుర్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ వ్యాఖ్యలకు నిరసనగా శనివారం భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, మండల అధ్యక్షుడు మారం రవి మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగాన్ని సోనియా కించపరిచేలా ఓల్డ్ పూర్ లేడి అని, అలాగే రాహుల్ గాంధీ మాట్లాడుతూ వెరీ బోరింగ్ నో కామెంట్ అని కించ పరిచేలా వ్యాఖ్యలు చేయడానికి నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కమ్మగాని శ్రీకాంత్, రామారావు, రవి, నూనె అనిల్, రాజేష్, గట్టు రాంబాబు, వేల్పుల దేవరాజ్, కొడిశాల యాదగిరి, పూజారి రమాకాంత్, ఈర్ల రాజు, మామిండ్ల వెంకన్న, శివ, గనగాని రాజు, ముకుందం, బెల్లి సతీష్ ఉన్నారు.

కొంత ఎక్కువ ఎంతో తక్కువ

మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

హనుమకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025 కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆశించిన కేటాయింపులైతే లేవు. దీర్ఘకాలకంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ఊసే లేదు. కొత్త రైల్వే ప్రాజెక్టులు, మార్గాల ప్రస్తావన కానరాలేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రకటన ఈసారి బడ్జెట్‌లో చోటుచేసుకోలేదు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం తన వంతుగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని వరంగల్‌వాసులు పడిన ఆశ నిరాశే అయింది. సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రస్తావన కూడా లేదు. ఎన్నో దశాబ్దాలుగా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కూడా ఈసారి బడ్జెట్‌లో కూడా హుళక్కే అయింది. ములుగులో ఏర్పాటవుతున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా నిధులేవీ కేటాయించలేదు. మేడారానికి జాతీయ హోదా కల్పన ఈసారి కూడా కలగానే మిగిలింది. నగరంలో భూగర్భ డ్రైనేజీకి రూ.4,170 కోట్లు ఇవ్వాలని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను పీఎం మిత్రలో చేర్చి రూ.300 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని, లెదర్‌పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కాజీపేట - భూపాలపల్లితో పాటు మూడు కొత్తలైల్వే లైన్లు, ప్రాజెక్టులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. జిల్లా ప్రజాప్రతినిధులు సైతం ఢిల్లీలో సంబంధిత శాఖల కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. వీటిలో వేటికీ బడ్జెట్‌లో చోటు దక్కలేదు.

ఉమ్మడి జిల్లాల్లో క్యాన్సర్ కేంద్రాలు

ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతీ జిల్లాలో క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ 200 జిల్లా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో రాబోయే రోజుల్లో క్యాన్సర్ ఆస్పత్రులు అందుబాటులో రానున్నాయి. ఈ యేడు వరంగల్ లేదా హనుమకొండ జిల్లాల్లో ఏదో ఒక దానిలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటయ్యే అవకాశం ఉంది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ఉన్నప్పటికీ దాని ద్వారా క్యాన్సర్ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స అందడం లేదు. దీంతో వీరంతా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాకో కేన్సర్ కేంద్రం ఏర్పాటుతో క్యాన్సర్ రోగులకు ఊరట లభించినట్లవుతుంది.

ఆదాయపు పన్ను శ్లాబు పరిమితి పెంపు

ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ప్రకటనకు ఎట్టకేలకు ఈ బడ్జెట్‌లో మోక్షం కలిగింది. ఆదాయ పన్ను శ్లాబు పరిమితిని పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తం అవుతున్నది. ఇకపై రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను ఉండదని స్పష్టం చేశారు. సవరించిన స్లాబ్‌ల ప్రకారం రూ.4లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు. బడ్జెట్‌లో సవరించిన స్లాబుల ప్రకారం మధ్య తరగతిపై పన్ను భారం గణనీయంగా తగ్గనున్నది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 18 లక్షల మంది మధ్య తరగతి వారికి లబ్ధి కలుగనున్నది.

కొన్నిటికి మోదం

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో కొంత మేరకు నిధుల కేటాయింపు జరిగినట్టు సమాచారం. అలాగే మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. లెదర్ ఉత్పత్తుల తయారీకి బడ్జెట్‌లో ప్రభుత్వం రాయితీలు ప్రకటించినందువల్ల ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న లెదర్ పార్కు జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశాలు కొంత మేరకు ఉన్నట్టు తెలుస్తోంది. బడ్జెట్‌లో వివిధ రంగాలకు ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇతరత్రా వాటి వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 10 లక్షల మంది ప్రజల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందే అవకాశం ఉన్నట్టు ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆదాయం పన్ను పరిమితి పెంపు వల్ల వరంగల్ జిల్లాలో సుమారు లక్షన్నర మందికి ప్రయోజనం కలుగనున్నది. మొత్తానికి బడ్జెట్ పట్ల అన్నివర్గాల ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది.



రైతులకు చేయూత

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని పెంచడంతో రైతులకు ఆర్థికంగా చేయూత లభించినట్లయింది. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలిచ్చే కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం వల్ల ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల మంది రైతులకు ప్రయోజనం సమకూరనున్నది. 1998లో ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ స్కీమ్ కింద ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. అయితే ఈ కార్డురుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం చాలాకాలం సవరించలేదు. ఈ పథకం కింద రైతులు 9 శాతం వడ్డీ రేటుతో రుణాలు తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం 2శాతం వడ్డీ రాయితీగా అందిస్తోంది. అదనంగా రైతులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించినట్లయితే రైతులు మరో 3 శాతం వడ్డీ రాయితీని పొందుతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులు రూ.360 కోట్ల మేరకు రుణాలు తీసుకున్నారు. కార్డు రుణ పరిమితిని రూ. 5లక్షలకు పెంచడంవల్ల రైతులు మరింత రుణం తీసుకునే వెసులుబాటు లభించనున్నది.

విమానాశ్రయానికి మార్గం

కేంద్ర బడ్జెట్‌లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు పెద్ద పీట వేశారు. పారిశ్రామిక, వ్యాపార, పర్యాటక రంగాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని దేశ వ్యాప్తంగా 150 విమానాశ్రయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది. ఇప్పటికే మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి చర్యలు ప్రారంభమయ్యాయి. అదనంగా అవసరమైన స్థల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయడానికి కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది.

చిన్న పరిశ్రమలకు ఊతం

బడ్జెట్‌లో ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్‌లకు ఊతం ఇస్తూ ప్రోత్సాహకాలు ప్రకటించడం వల్ల ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతం లభించనున్నది. ప్రభుత్వం ఇచ్చే రాయితీతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేందుకు మరింత ముందుకు వచ్చే అవకాశం ఉంది. స్టార్టప్‌లకు రూ.20కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ప్రకటించారు. అంకుర సంస్థలకు ప్రత్యేక క్రెడిట్ కార్డులు ఇస్తామని తెలిపారు. స్టార్టప్‌లకు ప్రోత్సాహకంగా రూ.5లక్షల పరిమితి కలిగిన క్రెడిట్ కార్డుల ఇవ్వనున్నట్టు, 10 లక్షల మందికి ఈ కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మైక్రోస్కేల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)లు 2,971 ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం జిల్లా పరిశ్రమ కేంద్రాల్లో 712 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

గిగ్ వర్కర్లకు శుభవార్త

అసంఘటిత రంగాల ఉద్యోగులకు (గిగ్ వర్కర్లు) కేంద్రం శుభవార్త తెలిపింది. 2025 బడ్జెట్ ద్వారా వారికి గుర్తింపుతో పాటు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలోని 2.10 లక్షల మంది గిగ్ వర్కర్లకు మేలు కలుగనున్నది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించనున్నట్టు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల గిగ్ వర్కర్లకు గుర్తింపుకార్డులు లభిస్తాయి. అలాగే ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద ఉద్యోగికి, కుటుంబానికి ఏడాదికి రూ.5లక్షల దాకా ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి రానున్నది. తాత్కాలికంగా తమకు ఉన్న వీలును బట్టి ఉద్యోగాలను చేసేవాళ్లను గిగ్ వర్కర్లు అంటారు. ప్రత్యేకించి యాప్‌ల ద్వారా సేవలందించే ఉద్యోగాల్లో ఎక్కువమంది ఉంటారు. డెలివరీ యాప్‌లు, రైడ్ యాప్‌లతో పని చేసే ఉద్యోగులతో పాటు ఫ్రీలాన్సర్లు, ఆన్‌లైన్ ట్యూటర్లు ఈ విభాగంలోకి వస్తారు. ఉమ్మడిజిల్లా ఈ తరహా ఉద్యోగులకు బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయంతో ఊరట కల్పించారు. ఈ ప్రోత్సాహకాల వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు లక్ష మంది గిగ్ వర్కర్లు మేలు జరగనున్నది.

వికసిత్ భారత్‌కు బాటలు
రావు పద్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ వికసిత్ భారత్‌కు బాటలు వేయవచ్చు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ప్రధాని ఎల్ల వేళలా ముందుంటాడని అనడానికి ఈ బడ్జెట్‌తో నిరూపణ అయింది. ఉద్యోగులకు ఇన్‌కమ్ టాక్స్ పరిధి 12 లక్షలకు పెంచడం సంతోషకరమైన విషయం. స్వయం ఉపాధి పొందే యువతకు అవకాశాల్ని పెంచుతూ పరిశ్రమల స్థాపనకు రుణ పరిమితిని పెంచి చేయూతనిచ్చిన బడ్జెట్. ప్రాణాధార మందుల ధరలను తగ్గేలా నిర్ణయం తీసుకోవడం మోదీ ప్రభుత్వం మానవత దృక్పథానికి నిదర్శనం.

ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదు
కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొర నిధులే కేటాయించారు. 50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి 1,28,650 కోట్లు మాత్రమే కేటాయించారు. బడ్జెట్‌లో ఇది 2.53 శాతమే. గత బడ్జెట్ కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో 0.03 శాతం నిధులు తక్కువగానే కేటాయించారు. ఇంత తక్కువ కేటాయింపులతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతుంది. ప్రైవేటు విద్యా రంగానికి ఊతమిచ్చేదిగా ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 6 శాతం నిధులు కేటాయిస్తేనే విద్యా రంగాన్ని బలోపేతం చేయవచ్చు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి
సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు ఏమీలేవు. బిహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, ప్రత్యేక నిధుల కేటాయింపులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెలంగాణకు ఐఐఎం ఐజీటీ, సైనిక్ పాఠశాలలు, కేంద్ర విద్యాసంస్థలు రావాల్సి ఉండగా వాటిని పట్టించుకోలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ముందడుగు వేయడంలో అవసరమైన నిధులను కేటాయించలేదు. ఓట్లు, సీట్లకు బీజేపీ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చింది.

ఇది సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్
తిప్పర్తి రాఘవరెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



కేంద్ర బడ్జెట్ సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్. బడ్జెట్‌లో ఆర్థిక వృద్ధి, మధ్య తరగతి ప్రజలకు పన్ను ఉపశమనం, వ్యాపార ప్రోత్సాహంపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రధాంగా రూ.12 లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు, మూలధన వ్యయం పెంపు, ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్‌లకు మద్దతు, బీమా రంగంలో ఎఫ్‌డీఐ సంస్కరణలు ప్రధానంగా చెప్పుకోదగ్గవి. మధ్య తరగతి వేతన జీవులకు భారీ పన్ను ఉపశమనం కలిగించడం ముదావహం. అధిక మూలధన వ్యయం, దీర్ఘకాలిక ప్రోత్సాహం బడ్జెట్‌లో పాజిటివ్ అంశాలు. బడ్జెట్‌లో రైతులకు కొత్త పథకాలను ప్రవేశపెట్టడం, పీఎం ధన్ ధ్యాన్ కృషి యోజన ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరునున్నది. ఎంఎస్‌ఎంఈ, సహకార రంగాలకు రుణ సదుపాయాలను కల్పించడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది.

అలరించిన సినీ సంగీత యుగళ గాన విభావరి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి మీరా కల్చరల్ సొసైటీ హనుమకొండ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సినీ సంగీత గాయకుడు సింగర్ చోటు 101 మంది గాయనీమణులతో సినీ నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినిమా చిత్రాల్లో పాడిన పాటలు ఆద్యంతం అలరించాయి. కర్ణాటక సంగీత విద్వాంసులు ప్రొఫెసర్ వి.తిరుపతయ్య, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జూరీ మెంబర్, చీఫ్ కోఆర్డినేటర్ టీవీ అశోక్‌కుమార్, విశ్వకర్మ (సాయిమీర కల్చరల్ సొసైటీ చైర్మన్), కర్ణకంటి పోతనాచారి తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి గాన విభావరిని లాంఛనంగా ప్రారంభించారు. 101మంది గాయనీమణులతో ప్రధాన గాయకుడు చోటు సింగర్ 12గంటల పాటు నిర్విరామంగా సినీ సంగీత యుగళగాన విభావరిని నిర్వహించారు. కార్యక్రమంలో రావులకోలను రాంమూర్తి, రాపాక పులిగిళ్ల వెంకటపద్మావతి, మగ్దుం మొహియుద్దీన్ సహకారంతో విభావరిని బి. భువన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి గాయనీమణులు పాల్గొని తమ గానామృతాన్ని వినిపించి ప్రేక్షకులను మంత్రముగ్దుల్ని చేశారు. అనంతరం గాయనీమణులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను నిర్వాహకులు ప్రదానం చేశారు.


సినీ యుగళ గీతాలను ఆలాపిస్తున్న గాయకుడు చోటు సింగర్

కోటా కోసం కొట్లాట!

- నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్
- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- బహిరంగ సభకు రానున్న జాతీయ నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

బీసీ ఉద్యమానికి పోరాటాల గడ్డ ఓరుగల్లు వేదికవుతోంది. బీసీల హక్కుల కోసం రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రాబోతున్నారు. ఆదివారం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి సభను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో పాటు జాతీయ బీసీ నేతలను ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను పూర్తి చేశారు. బీసీలను సభకు భారీగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రిజర్వేషన్ల పెంపు

బీసీలకు రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ యుద్ధభేరి నిర్వహిస్తున్నారు. రిజర్వేషన్లలో తమ వాటా.. కోటా.. కోసమే యుద్ధభేరి మోగిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ డిమాండ్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 23 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న 27 శాతాన్ని పెంచుకుంటూ పోవాలని బీసీ యుద్ధభేరి ప్రధాన డిమాండ్‌గా ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో 6.8 శాతమే ఉన్న అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూ ఎస్ కోటా కింద ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ రద్దు చేయాలని మరో డిమాండ్‌ను తెరపైకి తీసుకు వస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా వల్ల బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారనే వాదనను వినిపిస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలోనే బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలనే డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు. ఇప్పటికీ బీసీలపై చిన్నచూపు చూస్తున్నారని, కులం పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని బీసీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఈ 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నారు. వీటితో పాటు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు వివిధ సంక్షేమ పథకాల కోసం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్నారు.

నేడు లక్ష మందితో బీసీ యుద్ధభేరి

పోరాటాల గడ్డ ఓరుగల్లు నుంచి మరో ఉద్యమం ప్రారంభమవుతోంది. రాజకీయాల్లో బీసీల హక్కులు, ప్రభుత్వాలు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ యుద్ధభేరి సభను ఏర్పాటు చేశారు. లక్ష మందికి పైగా బీసీలను తరలించాలని ప్రణాళిక రూపొందించారు. వారం, పది రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీసీ యుద్ధభేరిని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలు

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే సదస్సుకు పొలిటికల్ జేఏసీ కన్వీనర్ సుందరాజ్ యాదవ్ నేతృత్వం వహిస్తుండగా, బిహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె, ఎంపీ మీసా భారతి, బీసీ ఉద్యమ నేతల బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్, డీఎంకే ఎంపీ విల్సన్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్రయాదవ్ తదితరులను ఈ సభకు రప్పిస్తున్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బస్వరాజు సారయ్య, బీఆర్ ఎస్ నేత, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యలతో పాటు మరికొంత మంది బీసీ నేతలను సభకు ఆహ్వానిస్తున్నారు. తెలంగాణలో జరుగుతున్న బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించటం ద్వారా జాతీయ మీడియా దృష్టికి బీసీ ఉద్యమాన్ని తీసుకెళ్లే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

సభకు ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, వివ్ జలయ్య

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

మంత్రులతో సీఎం భేటీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసనసభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏక సభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



తిమ్మంపేటలో విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు




దీపిక, మణి

స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): శివునిపల్లి పట్టణ హైస్కూల్ టెన్త్ విద్యార్థులు బానోతు మణి, భూక్య దీపిక జనగామ జిల్లా స్థాయి సీనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి 11వ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. 2,3తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మినీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం కె.రమేశ్, పీడీ కొండ రవి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల అమ్మ కమిటీ చైర్మన్ గుర్రం రాధిక, పూర్వ విద్యార్థుల కమిటీ బాధ్యులు యంజాల ప్రభాకర్, ఎమ్డీ దస్తగిరి, గోలి రాజశేఖర్, పి.సోమశేఖర్, ఎం.రవీందర్ అభినందించారు.

● జఫర్‌గడ్: తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు లాకావత్ దీపిక, బుల్లె స్పందన, పెండ్లి నిఖిత (9వ తరగతి) సాఫ్ట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనగామలో జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్ఎం శరేన్, పీడీ హరిత తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, లక్ష్మీప్రసన్న, ఉదయశ్రీ, జ్యోతి, శిరీష, మాల్యా, మధుకర్, మహేందర్, హరిప్రసాద్, జహీరుద్దీన్ అభినందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రాంరాజుపల్లిలో బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న దయాకర్‌రావు

దేవరుప్పుల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం పరామర్శించారు. రాంరాజుపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసగాని ఐలయ్య ఇటీవల మరణించగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, నాయకులు బస్వ మల్లేశం, నర్సింహులు పాల్గొన్నారు.

● కొడకండ్ల: రంగాపురానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నన్నబోయిన గట్టయ్య, పండుగ వెంకన్నలు ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న దయాకర్‌రావు వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సింధె రామోజీ, డి.వెంకటేశ్వర్‌రావు, మేటి సోమరాములు, ప్రేంకుమార్, డి.సతీష్, సొమాని, శ్రీను పాల్గొన్నారు.

● పాలకుర్తి: వల్మిడికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారపెల్లి అంజయ్య అత్తమ్మ ఇటీవల మృతి చెందగా దయాకర్‌రావు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు సోమయ్య, రావుల బీమన్న, రాజు, దోకూరు రాజయ్య, పర్వత వెంకటయ్య ఉన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



అధికారికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 1(ఆంధ్ర జ్యోతి): అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని, అసైన్డ్ భూముల్లో అక్రమ కట్టడాలను ఆపాలని సీపీఎం మండల కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. శనివారం పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, ప్రతినిధులు వడ్లకొండ సుధాకర్, తదితర నేతలు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో జఫర్‌గడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎండి.షబాన, నాయకులు వేల్పుల పెద్ద రాములు, చిన్న రాములు, శంషోద్దీన్, యాకన్న పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణం



వేంకటేశ్వరుని కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. శనివారం ఆలయ ఆవరణలో చేపట్టిన కల్యాణ మహోత్సవానికి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న హాజరయ్యారు. వారి చేతులమీదుగా ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణ వేడుకలకు భక్తులు పెద్దఎత్తున తరలిరాగా, వారికి పూజారులు ఆశీర్వచనం అందజేశారు.



చిన్నపెండ్యాలలోని మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న పద్మశాలీలు



బచ్చన్నపేటలో మార్కండేయ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా మార్కండేయుడి జయంతి

చిలుపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : భక్త మార్కండేయుని జయంతిని చిన్నపెండ్యాలలో ఘనంగా నిర్వహించారు. శనివారం పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గజ్జెల దామోదర్ నేతృత్వంలో పద్మశాలీలు మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు, పేరాల నాగభూషణ్, రమేష్, కుమారస్వామి, అశోక్, సుధాకర్, వెంకటేశ్వర్లు, సౌమ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● పాలకుర్తి: మార్కెండేయ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని పద్మశాలీలు ఆయన చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడారపు సుధాకర్, పెనుగొండ నమేష్, చిదురాల మార్కెండయ్య, ఎల్లయ్య, చిలుకమారి వెంకటేశ్వర్లు, సమ్మయ్య, వరప్రసాద్, కామారపు సునిల్ తదితరులు ఉన్నారు.

● బచ్చన్నపేట: బచ్చన్నపేటలోని మార్కండేయ స్వామి ఆలయంలో జయంతుత్సవాలు జరిగాయి. పద్మశాలీలు హోమాలు నిర్వహించారు. ఈమేరకు ట్రాక్టర్‌లో మగ్గంను ఏర్పాటు చేసి స్వామి వారికి వస్త్రాన్ని అలంకరించేందుకు గ్రామం చుట్టూ ఊరేగింపు చేస్తూ నేశారు. మహిళలు మంగళ హారతులు పట్టారు. కార్యక్రమంలో మచ్చ నరేందర్, గుర్రపు బాల్‌రాజు, బేతి కృష్ణమూర్తి, మంగళంపల్లి కృష్ణమూర్తి, కేశవులు, పాండు, నగేష్, సుధాకర్, లక్ష్మణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గడ్: మార్కండేయ జయంతి వేడుకలు మండల కేంద్రంలో జరిగాయి. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి సంఘం పూజలు జరిపింది. కార్యక్రమంలో పద్మశాలి, అనుబంధ సంఘాల జిల్లా, మండల ప్రతినిధులు బైరి వెంకటేశ్వర్లు, కన్న సోమశేఖర్, ఈరబత్తిని అంజయ్య, బైరి శ్రీనివాస్, మేక నర్సయ్య, బైరిరవి, సోమశేఖర్, ఉపేందర్, ఆంజనేయులు, కృష్ణ, సత్యనారాయణ, మంగలం పెల్లి వెంకటేశ్వర్లు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



జఫర్‌గడ్‌లో వేడుకల్లో పాల్గొన్న పద్మశాలీలు

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. 6వ తరగతితోపాటు, ఖాళీగా ఉన్న 7 నుంచి 10వ తరగతి వరకు సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఐదవ తరగతి బోనఫైడ్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.125లు, ఇతరులు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే పెద్దపీట

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇప్పగూడెం గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పెద్దపీట వేశారని కాంగ్రెస్ జిల్లా నాయకులు గోడుగు రాజయ్య, పల్లె రవీందర్‌లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.75లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు, సీసీ రోడ్డు పనులకు శనివారం పీఆర్ ఏఈ రామకృష్ణ ఆధ్వర్యంలో మార్కింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మంద రాజు, మ్యాదరబోయిన కుమారస్వామి, డ్రైవర్ మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయ చైర్మన్‌గా మల్లారెడ్డి?

బచ్చన్నపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్ధేశ్వరాలయ చైర్మన్‌గా రాంచంద్రాపూర్‌కు చెందిన ఆముదాల మల్లారెడ్డి నియామకం దాదాపు ఖరారైనట్టు తెలిసింది. జనవరి 27న ఇందుకు సంబంధించిన నియామక ఉత్తర్వును దేవాదాయశాఖ అధికారులు ఇచ్చినట్టు ఆలస్యంగా వెలుగు చూసింది. కొద్ది రోజుల్లో బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావటంతో హంగూ ఆర్భాటాలకు పోకుండా కమిటీని ప్రకటించినట్టు తెలిసింది. డైరెక్టర్‌లుగా మంతపురి రాములు, ఇమ్మడి తిరుపతిరెడ్డి, కాశిరెడ్డి శ్రీనివాస్, నిమ్మ కర్ణాకర్ రెడ్డి, పెల్మెల్లి వెంకటయ్య, ఈర్ల శివరాములు, రావుల భిక్షపతి, సూత్రామే రామకృష్ణ, వల్లాల సత్యనారాయణ, కీసరి రమేష్, మొద్దు బాలభాస్కర్, ఆముదాల మల్లారెడ్డి, నేరెళ్ల రాజేశ్ పేర్లతో కమిటీ ఉత్తర్వు విడుదలైంది. కాగా మల్లారెడ్డిని చైర్మన్‌గా డైరెక్టర్లంతా ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట రజక సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవరకొండ వెంకటయ్య, ప్రధానకార్యదర్శిగా పెనుమెల్లి భానుచందర్, ఉపాధ్యక్షులుగా పోచంపల్లి సిద్దులు, యూత్ అధ్యక్షుడిగా మేడిచెలిమి రాజులను ఎన్నుకున్నారు.

వర్గీకరణ చేసే వరకు ప్రభుత్వాన్ని వదలం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తే లేదని జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి, అంబేడ్కర్ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్‌లు హెచ్చరించారు. శనివారం జనగామలో మందక్రిష్ణ పాల్గొన్న బహిరంగ సభకు దళిత సంఘాల నాయకులు ఘన్‌పూర్ నుంచి తరలివెళ్లారు కార్యక్రమంలో నాయకులు కలకోల యాదగిరి, గడ్డమీది వెంకటస్వామి, తాటికొండ సురేష్‌కుమార్, గుర్రం యాదగిరి, గాదెపాక ఆయోధ్య, సింగపురం దయాకర్, జగన్, రడపాక సుదర్శన్, ఎడ్ల వెంకటస్వామి, చింత శ్రీనివాస్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను సక్సెస్ చేయాలి

చిలుపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా 7న లక్ష డప్పులు- వేల గొంతుకలు పేరుతో హైదరాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్ పిలుపునిచ్చారు. చిన్నపెండ్యాలలో విలేకరులతో మాట్లాడుతూ వర్గీకరణ న్యాయమైన అంశమన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గజ్జెల దామోదర్, బీఆర్ఎస్ నాయకులు జనగామ యాదగిరి, కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, కలకోళ్ళ పోశయ్య, చిలుపూర్ ఆలయ మాజీ చైర్మన్ యాదవరెడ్డి, సాంబారి శ్రీనివాస్, ఇల్లందుల ప్రభాకర్ పాల్గొన్నారు.



అయ్యప్పగుడి నిర్మాణానికి విరాళం

కొడకండ్ల ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని జర్నలిస్టు హిల్స్‌పై అయ్యప్ప ఆలయ నిర్మాణానికి చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత మధుసూదన్‌రెడ్డి కుమార్తె ఎన్ఆర్ఐ కె.స్వర్ణలతా రెడ్డి రూ.5 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను కమిటీ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో శ్రీపాద అంజనేయచారి, ఎం. మల్లయ్య, డి.సతీష్, ఎం.రవీందర్, శరత్, మేరుగు సోమేశ్వర్, మనోహర్, దయానంద్ పాల్గొన్నారు.

హనుమాన్ గుడి నిర్మాణానికి..



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్ ఘన్‌పూర్ తిరుమల నాథ స్వామి దేవాలయ ఆవరణలో నిర్మిస్తున్న హనుమాన్ గుడి నిర్మాణానికి శనివారం వ్యాపారులు ఎస్.ఆంజనేయులు, శశిక్ రూ.25వేలు, దిడిగం బుచ్చయ్య రూ.25 వేలు పూజారి రాముకు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, శేషాచారి, తెల్లాకుల రామకృష్ణ, ఎం.రవీందర్, నరేందర్, యాద శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

చిన్నమడూరు కాంగ్రెస్ గ్రామశాఖ ఎన్నిక



ఝాన్సీరెడ్డిని కలిసిన కమిటీ


దేవరుప్పుల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చిన్నమడూరు గ్రామశాఖను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగ దశరథ, ప్రధాన కార్యదర్శిగా వాసర్ల వీరస్వామి, ఉపాధ్యక్షులుగా మొటికె చంద్రశేఖర్, పరీదుల శ్రీధర్, నారాయణదాసు ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా మొగుళ్ల వెంకటేశ్వర్లు, కోట యాకన్న, కోశాధికారులుగా ముసిగంపుల శ్రీను, జనగాం బాలరాజు, కన్వీనర్లుగా పరీదుల కృష్ణమూర్తి, వంగ మల్లేష్, ముసిగంపుల సమ్మయ్య, కంకటి యాదగిరి, అనగాని రాజు, మేడ నర్సయ్య, యూత్ అధ్యక్షుడిగా మొగుళ్ల హరీష్‌లు ఎకగ్రీవంగా ఎన్నికైనట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ వివరించారు. పాలకవర్గాన్ని పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అభినందించారు.

ఉత్తమ ఉద్యోగికి సన్మానం

పాలకుర్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరున్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న లైన్‌ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) అధ్యక్షుడు డివిజన్ అధ్యక్షుడు రాజలింగం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మహేందర్, సాయిలు, సురేందర్, నాగరాజు, నయాం ఉన్నారు.

ఇప్పగూడెంలో రైతుల నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఐకేపీ కొనుగోలు కేంద్రంలో విక్రయించిన సన్నధాన్యంకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను వెంటనే చెల్లించాలని ఇప్పగూడెం రైతులు శనివారం నిరసన తెలిపారు. బాధిత రైతులు మాట్లాడుతూ సన్నధాన్యంకు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందనే ఆశతో తక్కువ దిగుబడి వస్తుందని తెలిసీ, సాగుచేశామన్నారు. ధాన్యం విక్రయించి, రెండు నెలలైనా బోనస్‌ను తమ ఖాతాల్లో వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు మైపాషా, బాధిత రైతులు కత్తుల సుధాకర్, బొల్లెడ్ల రమణారెడ్డి, తోటకూరి గట్టయ్య, పిట్టల నర్సయ్య, సుజ్ఞాన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిల్లర గణేష్, సట్ల రమేష్, ఆకుల రమేష్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రైతులు

న్యూస్ బాక్స్

సీసీ కెమెరాలపై పట్టింపేది?



పైకి ఉన్న సీసీ కెమెరా

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇప్పగూడెంలో అక్కపల్లిగూడెం వెళ్లే దారిలో కరెంట్ పోల్‌కు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా పైకి చూస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఇటీవల గ్రామాల్లో నేరాలు పెరుగుతున్న విషయం తెలిసిందే. నేరస్తులను పట్టించడంతో ముఖ్యపాత్ర పోషించే సీసీ కెమెరాల ఆలనాపాలనను అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే, పలు సీసీ కెమెరాలు ఉండి నిరుపయోగంగా మారాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి, వాటి పనితీరును పర్యవేక్షించాలని కోరుతున్నారు.

కరెంట్ పోల్ ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చిలుపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : 'యమపాశాలుగా విద్యుత్ తీగలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఏఈ లక్ష్మీనారాయణ నేతృత్వంలో చిలుపూర్ మండల కేంద్రానికి చెందిన ఆవుల చిన్న వ్యవసాయ పొలం దగ్గరికి వెళ్లారు. అక్కడ కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను పరిశీలించారు. అదనపు పోల్‌ను నాటి సమస్యకు పరిష్కారం చూపారు. ఏఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, స్తంభానికి అనుసంధానంగా బిగించిన సపోర్ట్ వైర్‌ను తొలగించడం వల్లే వైర్లు లూజ్ అయ్యాయని పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీటీ



బాధ్యతలు స్వీకరించిన డీటీ, ఆర్ఐ

జఫర్‌గడ్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జఫర్‌గడ్ డిప్యూటీ తహసీల్దార్‌గా శనివారం అనిల్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా పని చేసిన ఖాసీం జనగామకు బదిలీ కావడంతో జఫర్‌గడ్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న అనిల్‌బాబును ఇదే కార్యాలయంలో పదోన్నతిపై డీటీగా కలెక్టర్ నియమించారు. అలాగే ఖాళీగా ఉన్న ఆర్ఐ స్థానంలో కొడకండ్ల నుంచి పదోన్నతిపై బాలస్వామి జఫర్‌గడ్‌కు బదిలీ కాగా, ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

నాణేలతో తులాభారం



జఫర్‌గడ్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన వెల్దుగొండ లక్ష్మీనర్సింహస్వామికి ఓ భక్తుడు రూపాయి నాణేలతో తులాభారం వేసి మొక్కులు చెల్లించాడు. శనివారం జఫర్‌గడ్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రంగరాయిగూడెంకు చెందిన భక్తుడు ఐత సాకేత్ తన కుమారుడు మోక్షిత్ బాలుడిని నాణేలతో తులాభారం వేశారు. 12కిలోల బరువు గల నాణేలను హుండీలో వేసి మొక్కు సమర్పించారు.

గుడుంబా పట్టివేత

చిలుపూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుడుంబా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు శనివారం తెలిపారు. కొండాపూర్ పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన గుగులోత్ నరేష్ తన ద్విచక్ర వాహనంపై ఆరు లీటర్ల గుడుంబాను తరలిస్తున్నాడు.

సమాచారం అందుకుని అతడిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



చిన్నపెండ్యాలలో పోటీలో చిన్నారులతో ఉపాధ్యాయులు



తరిగొప్పుల మండలస్థాయి ప్రజ్ఞోత్సవంలో విద్యార్థులు



నర్మెటలో బహుమతులు అందిస్తున్న ఎస్సై నగేష్, ఎంఈవో అయిలయ్య



దేవరుప్పులలో విద్యార్థులతో ఎంఈవో కళావతి

ఆకట్టుకున్న ప్రజ్ఞోత్సవం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజ్ఞోత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రతిభను వెలికి తీసేందుకు వివిధ పోటీలను నిర్వహించారు. వివిధ వేష ధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు అందించారు.

బీసీ యుద్ధభేరి మహాసభకు తరలిరండి

చిలుపూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నేడు(ఆదివారం) హన్మకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించే బీసీల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి గంటె ఉపేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. చిన్నపెండ్యాలలో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబు, తాళ్ళపల్లి క్రాంతి, ఎల్లయ్య, రాజు, శ్రవన్, అశోక్, రంజిత్, రాజమౌళి పాల్గొన్నారు.

● పాలకుర్తి : హన్మకొండలో జరిగే బీసీ యుద్ధభేరికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీప్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కెటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మా చెర్ల ఎల్లయ్య, కర్ణాకర్‌రెడ్డి, మహేందర్, వెంకటేష్, కమ్మగాని వెంకటేష్ తదితరులు ఉన్నారు.

● తరిగొప్పుల: బీసీ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ జనగామ జిల్లా ఇన్‌చార్జి చిలువేరు లింగం కోరారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న బీసీ కులాలు వారి హక్కుల సాధన కోసం ఒక్కతాటిపై వచ్చి పోరాడాలని సూచించారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు